

రూ. లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భవానీప్రసాద్ రూ. లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.



గోవిందా.. గోవింద

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం స్వామి ఉత్సవ పల్లకీ ఆర్.క్రిష్ణాపురానికి చేరుకుంది. ఉత్సవ మూర్తులను భక్తులు దర్శించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం


పూర్తి మట్టం	: 1.633 అడుగులు
ప్రస్తుతం	: 1,620.19
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 61.861
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9.637

న్యూస్‌రీల్

4 నుంచి వాయుసేనలో ఉద్యోగాల ఎంపిక

కర్నూలు(హాస్పిటల్): భారత వాయుసేనలో గ్రూప్ వై మెడికల్ అసిస్టెంట్ (పురుషులు) ఉద్యోగాల ఎంపిక కార్యక్రమం వచ్చే నెల 4 నుంచి 8వ తేదీ వరకు చెన్నైలో నిర్వహిస్తారని జిల్లా యువజన సంక్షేమాధికారి పీవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ముందుగా రాతపరీక్ష ఉంటుందని, ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఆరోగ్య శారీరక దారుఢ్యపరీక్షలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు భారత వాయుసేన వెబ్‌సైట్ www.airmenselection.cdac.in, 9345377868ను సందర్శించాలన్నారు.

ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.14 లక్షలు



కర్నూలు(రాజ్‌విహార్): సంక్రాంతి పండుగ ఆర్టీసీకి మంచి ఆదాయాన్ని తెచ్చి పెట్టింది. వారం రోజులుగా వివిధ దూర ప్రాంతాలకు నడిపిన బస్సు సర్వీసుల ద్వారా రూ.14.32 లక్షల ఆదాయం వచ్చింది. హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, విజయవాడకు మొత్తం 61 బస్సు సర్వీసులు నడపగా 6,054 మంది ప్రయాణించినట్లు రీజినల్ మేనేజరు వెంకటరామం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడిపినట్లు వెల్లడించారు.

23న నీతి ఆయోగ్ బృందం రాక

కర్నూలు(హాస్పిటల్): నీతి ఆయోగ్ కేంద్ర బృందం ఈ నెల 23వ తేదీన జిల్లాకు రానుంది. ఈ బృందం జిల్లాలోని హుసేనాపురం, నన్నూరు, కల్లూరు, కలుదేవకుంట్ల, కోసిగి పీహెచ్‌సీలతో పాటు రెండు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించనుంది. ఆయా కేంద్రాల్లోని వైద్యులు, సిబ్బంది, పరికరాలు, మందుల గురించి బృందం సభ్యులు సేకరించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు.

హాస్టళ్ల నిర్వహణలో రాజీ పడొద్దు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో వసతి గృహ సంక్షేమాధికారులు ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడరాదని ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి అన్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 19 నుంచి ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయన బుధవారం సంక్షేమ భవన్‌లోని తన కార్యాలయంలో కర్నూలు, పత్తికొండ, కోడుమూరు సహాయ సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టళ్లలో హెచ్‌డబ్ల్యూఓలు ఉదయం, సాయంత్రం తప్పక ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే సెలవుల దృష్ట్యా వసతి గృహాల పరిసరాలు, గదులు దుమ్ము ధూళి పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారై ఉంటాయన్నారు. విద్యార్థులు వచ్చేలోగా హాస్టళ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ తప్పక పాటించాలన్నారు. 10వ తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతున్న దృష్ట్యా అన్ని వసతి గృహాల్లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏఎస్‌డబ్ల్యూఓలు బి.మద్దిలేటి, కె.బాబు, ఎస్.లీలావతి పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు

- జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి




కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈ నెల 19, 21, 23, 24.. ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకు మొబైల్ ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని మండలాలు, మున్సిపల్ ప్రాంతాల్లోని 61 ఆధార్ కేంద్రాల పరిధిలోని సచివాలయాల్లో ఆధార్ నమోదుకు ఏర్పాట్లు చేశామన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, 5 నుంచి 15 సంవత్సరాల్లోపు బాల బాలికలు, ఇంటి చిరునామా, మొబైల్ నెంబర్, ఫొటో మార్పుతో పాటు వేలి ముద్రలు, బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలను ఈ కేంద్రాల్లో సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2010 నుంచి 2016 సంవత్సరాల మధ్య ఆధార్ నమోదు చేసుకొని, ఇప్పటి వరకు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోని వారు విధిగా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనతంత్ర వెలుగులు!

చరిత్రకు సాక్ష్యంగా.. కర్నూలు ఠీవిని చాటుతూ.. నగర నడిబొడ్డున రొమ్ము విరుచుకు నిలుచున్న కొండారెడ్డి బురుజు గణతంత్ర వేడుకలకు ముస్తాబవుతోంది. ఉదయమంతా మౌనంగా కనిపించే ఈ కట్టడం.. సాయంత్రం కాగానే స్వాతంత్ర్యపు స్వేచ్ఛా వెలుగుల్లో కొత్త శోభను సంతరించుకుంటోంది. పాత బస్టాండ్ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగించే ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షిస్తూ మదిమదిలో నిత్య నూతనమై నిలుస్తోంది.

– ఫొటోలు: డి.హుస్సేన్



దిగులు తొలగిస్తూ.. ధీమానిస్తూ!

పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్ బీమా పథకం


- రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబమూ లబ్ధిదారే
- సహజ మరణానికి రూ.లక్ష, ప్రమాద మరణానికి రూ.5 లక్షల పరిహారం
- 2021-22లో ఉమ్మడి జిల్లాలో 1,398 కుటుంబాలకు భరోసా
- 2022-23లో కర్నూలు జిల్లాలో 496, నంద్యాల జిల్లాలో 477 కుటుంబాలకు చేయూత



సత్వర సాంత్వన

వైఎస్సార్ బీమా పరిహారం ప్రొసీడింగ్స్ అందుకుంటున్న ఈమె పేరు జెల్లి జయమ్మ. ఆదోని మండలం ఆరేకల్ గ్రామానికి చెందిన ఈమె భర్త జెల్లి రాఘవేంద్ర ప్రమాదవశాత్తూ 2022 సెప్టెంబరు 6వ తేదీన మృతి చెందాడు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న వీరికి వైఎస్సార్ బీమా అండగా నిలిచింది. నాలుగు నెలల్లోనే 2022 డిసెంబరు 1న రాఘవేంద్ర భార్య జెల్లి జయమ్మకు రూ.5 లక్షల పరిహారం మంజూరైంది. సత్వర స్వాంతన చేకూర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామని జయమ్మ తెలిపారు.





బాధిత కుటుంబానికి ఊరట

ఈ చిత్రంలో కనిపించే మహిళ పేరు నాగేశ్వరమ్మ, కర్నూలు మున్సిపాలిటీ పరిధిలోని మాసామసీదు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఈమె భర్త కురువ నాగరాజు ప్రమాదవశాత్తు 2022 ఆగస్టు 10న మృతి చెందాడు. ఇద్దరు కుమారుల పోషణ కష్టంగా ఉన్న తరుణంలో ఈ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా ద్వారా చేయూత ఇచ్చింది. నాగేశ్వరమ్మకు రూ. 5 లక్షల పరిహారం లభించింది.

పకడ్బందీగా బీమా పథకం అమలు



వైఎస్సార్ బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. సచివాలయంలో ఎంత త్వరగా డాక్యుమెంటేషన్ పూర్తి చేసి పంపితే అంత త్వరగా క్లయిమ్ పరిష్కారం అవుతుంది. రైస్ కార్డు కలిగిన కుటుంబాలన్నిటికీ వైఎస్సార్ బీమా లభిస్తుంది. కర్నూలు జిల్లాలో 5 లక్షలకుపైగా కుటుంబాలకు వైఎస్సార్ బీమా సదుపాయం ఉంది.

– వెంకటసుబ్బయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

కర్నూలు(అగ్రికల్చర్): అకస్మాత్తుగా జరిగిన ప్రమాదాలు.. ఊహించని విపత్తులు.. పేద కుటుంబాలను శోకసంద్రంలోకి నెడుతున్నాయి. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి మరణంతో ఆయా కుటుంబాల్లో నైరాశ్యం నెలకొంటోంది. అప్పటి వరకు సాఫీగా సాగిన జీవితం తలకిందులవుతోంది. ఆర్థిక ఇబ్బందులతో పిల్లల చదువులు సైతం ఆగిపోతున్నాయి. పేదల కష్టాలను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తూ వారిలో దిగులును తొలగిస్తోంది. ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక చేయూత అందిస్తూ ధీమా నింపుతోంది.

రూపాయి కూడా ప్రీమియం లేకుండా..

రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబంలో ఒకరికి (ఇంటి యజమానికి) రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తోంది. కర్నూలు జిల్లాలో 5,05,094 కుటుంబాలకు, నంద్యాల జిల్లాలో 4,13,498 కుటుంబాలకు వైఎస్సార్ బీమా సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. బీమా ఉన్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, ప్రమాదంలో రెండు కాళ్లు లేదంటే రెండు చేతులు పోతే రూ.5 లక్షలు, ఒక కాలు, ఒక చేయిపోతే రూ.2.50 లక్షలు, సాధారణంగా మరణిస్తే రూ.లక్ష ప్రకారం పరిహారం లభిస్తుంది. 18 నుంచి 70 ఏళ్లలోపు వారికి ప్రమాద బీమా, 18 నుంచి 50 ఏళ్లలోపు వారికి సహజ మరణం బీమా వర్తిస్తుంది. ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకొని క్లయిమ్‌లను పరిష్కరిస్తారు. సహజ మరణానికి పరిహారం పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రమాదవశాత్తూ జరిగే మరణాలకు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం ఓరియంటల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. అసంఘటిత రంగంలోని రైస్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఒక్క రూపాయి కూడా ప్రీమియం లేకుండా వైఎస్సార్ బీమా సదుపాయం కల్పించడం విశేషం. సహజ మరణం పొందినా, ప్రమాదశాత్తూ మరణించినా వెంటనే సంబంధిత సచివాలంలోని వెల్ఫేర్ అసిస్టెంటుకు సమాచారం ఇస్తే 24 గంటల్లోపు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు చెల్లిస్తారు.

గడువులోపు పరిహారం..

వైఎస్సార్ బీమా కింద క్లయిమ్‌ల పరిష్కారానికి ప్రత్యేక షెడ్యూలు ఉంది. దీని ప్రకారం సహజ మరణం క్లయిమ్‌లను 24 రోజులు, ప్రమాద మరణం క్లయిమ్‌లను 65 రోజుల్లోను పరిష్కరిస్తున్నారు. సచివాలయం స్థాయిలో జరిగే డాక్యుమెంటేషన్‌ను అనుసరించి క్లయిమ్‌లు పరిష్కారం అవుతాయి. సహజ, ప్రమాద మరణాలకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు డాక్యుమెంటేషన్ పూర్తి చేసి కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ-వైకేపీలోని వైఎస్ఆర్ బీమా కాల్ సెంటర్‌కు పంపాల్సి ఉంది. కాల్ సెంటరులో బీమా డీపీఎం, డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్‌లు పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే ఆమోదించి పరిహారం చెల్లింపు కోసం జీఎస్‌డబ్ల్యూస్ డిపార్టుమెంట్‌కు పంపుతారు. సహజ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రమాద మరణాలకు ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ పరిహారం చెల్లిస్తుంది.

లక్షలాది పేద కుటుంబాలకు భరోసా

జాప్యం లేకుండా క్లయిమ్‌లు పరిష్కారమవుతుండడంతో ఆయా కుటుంబాలకు భరోసా లభిస్తోంది. 2021-22లో వైఎస్సార్ బీమా కింద 1,398 కుటుంబాలకు భరోసా దక్కింది. 2022-23లో కర్నూలు జిల్లాలో సహజ మరణం పొందిన 496 కుటుంబాలకు రూ.4.82 కోట్లు, నంద్యాల జిల్లాలో 477 కుటుంబాలకు రూ.4.60 కోట్లు పరిహారం లభించింది. 30 క్లయిమ్‌లకు పరిహారం చెల్లించే ప్రక్రియ ప్రాసెస్‌లో ఉంది. ఈ ఏడాది కర్నూలు జిల్లాలో ప్రమాద మరణాల క్లయిమ్‌లు 80 రిజిష్టర్ కాగా 35 పరిష్కారం అయ్యాయి. నంద్యాల జిల్లాలో ప్రమాద మరణాల క్లయిమ్‌లు 76 రిజిష్టర్ కాగా 23 పరిష్కారం అయ్యాయి. మిగిలినవి ప్రాసెస్‌లో ఉన్నాయి.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

- జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ కోటేశ్వరరావు



జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్, కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, డీటీసీ శ్రీధర్, కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు

కర్నూలు(సెంట్రల్): రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జనవరి 11 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఓర్వకల్లు సమీపంలో నిర్మించనున్న అండర్ పాస్ డిజైన్ల నమూనాలను పరిశీలించారు. కర్నూలులోని సంతోష్‌నగర్ ఫ్లై ఓవర్ వద్ద ఇరువైపుల సర్వీసు రోడ్లను మూసివేయాలని ఆదేశించారు. కర్నూలు నగరంలోని మెడికల్ కాలేజ్, మద్దూర్‌నగర్, బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్ సర్కిళ్లలో రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ, మునిసిపల్, ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. కర్నూలు నగరంలో పని చేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజను ఆదేశించారు. నంద్యాల చెక్ పోస్టు నుంచి రాయలసీమ యూనివర్సిటీ వరకు అవసరం లేని స్పీడు బ్రేకర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను డీటీసీ శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.

ట్రిపుల్ ఐటీ డీఎంలో మౌలిక వసతులు కల్పించండి

జగన్నాథగట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటీడీఎం విద్యాసంస్థలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదనపు భూసేకరణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓ హరిప్రసాద్‌ను ఆదేశించారు. భవన సముదాయం చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈని ఆదేశించారు. జాతీయ రహదారి 44 నుంచి ట్రిపుల్‌ఐటీ డీఎంకు అప్రోచ్ రోడ్డు కోసం నిధులు మంజూరయ్యాయని, వెంటనే టెండర్లను పిలవాలన్నారు. నీటి వసతి కోసం ప్రతిపాదనలు పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్, హైటెన్షన్ వైర్లను తొలగించేందుకు రెండు రోజుల్లో సర్వే చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్‌డీఓ హరిప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, పీఆర్ ఎస్‌ఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.

పేదింటికి మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఉనికి కోసమే చంద్రబాబు బురదజల్లే రాజకీయాలు
- ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను తిప్పికొడదాం
- సచివాలయ జేసీఎస్‌ల మండల కన్వీనర్ల సమావేశంలో కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న కర్నూలు,నంద్యాల జిల్లాల సచివాలయాల కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్ రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): పేదింటికి మంచి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల (జేసీఎస్) ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా పరిశీలకులు ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో సచివాలయ జేసీఎస్ మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మంచి జరిగితే తన ఉనికికి ప్రమాదమని భావించిన చంద్రబాబు నాయుడు బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఎల్లో మీడియాతో అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అస్తమానం అబద్దాలు చెప్పే చంద్రబాబు అండ్ కంపెనీని ప్రజలు నమ్మరని, అయినా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలన్నారు. అనంతరం నంద్యాల, కర్నూలు జిల్లాల పార్టీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండంతో అబద్దాల చంద్రబాబు మళ్లీ గిమ్మిక్కులు చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ప్రతి పేద కుటుంబానికి మంచి చేస్తున్నారన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు వర్తింజేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని, ఈ విషయాన్ని ప్రతి గడపకు వెళ్లి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎంఏ హఫీజ్‌ఖాన్, చెన్నకేశవరెడ్డి, డాక్టర్ సుధాకర్, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, పార్టీ నేతలు వై. ప్రదీప్‌రెడ్డి, వై. మనోజ్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కర్రహర్షవర్ధన్‌రెడ్డి, మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గోకుల్ కృష్ణారెడ్డి, వంగాల భరత్‌కుమార్ రెడ్డి, నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఆదిదంపతులు

- శ్రీశైలంలో ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో పార్వతీ సమేత మల్లికార్జున స్వామి అశ్వవాహనంపై ఊరేగారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వామి,అమ్మవార్ల ఉత్సమూర్తులను అశ్వవాహనంపై ఉంచి కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఆలయ ఉత్సవం నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం రోజున నూతన వధూవరులైన పార్వతీ మల్లికార్జున స్వామి వార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా 18 రకాల పుష్పాలు, బిల్వం, మువం, యాచి పత్రి మొదలైన మూడు రకాల పత్రాలతో స్వామిఅమ్మ వార్లకు పూజలు చేశారు. 9 రకాల ఫలాలు కూడా నివేదించారు. పూజా కార్యక్రమాల్లో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పగిద్యాల: మండల కేంద్రమైన పగిద్యాలకు చెందిన బాలస్వామి జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గుర్తించి 108లో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెద్దాసుపత్రిలో గుండెశస్త్రచికిత్సలు పునఃప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గుండెశస్త్రచికిత్సలు పునఃప్రారంభమయ్యాయి. ఆరు నెలలు క్రితం మత్తు మందు ఇచ్చే డాక్టర్ బదిలీ కావడంతో గుండెశస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆయన తిరిగి కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు గత వారం నుంచి గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు మొదలయ్యాయి. ఈ నెల 11న నందవరానికి చెందిన ఈరన్న(46)కు ఆపరేషన్ నిర్వహించారు. ఈయనకు గతంలో స్టెంట్ వేయగా మళ్లీ బ్లాక్ ఏర్పడడంతో ఆసుపత్రిలో చేరారు. అతనికి బీటింగ్ హార్ట్ బైపాస్ సర్జరీ నిర్వహించారు. ఆయనతో పాటు కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన పెద్ద మాదన్న(74)కు మంగళవారం ఆపరేషన్ చేశారు. ఈయనకు హార్ట్‌లో వాల్వ్‌లు బ్లాక్ కావడంతో బీటింగ్ హార్ట్ బైపాస్‌సర్జరీ చేశారు. ఈ రెండు శస్త్రచికిత్సలతో కలిపి ఇప్పటి వరకు ఈ విభాగంలో గుండె శస్త్రచికిత్సల సంఖ్య 505కు చేరుకున్నట్లు హెచ్‌వోడీ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం తనతో పాటు అనెస్తెటిస్ట్ ఉండటం, కొత్తగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరిక్రిష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర, డాక్టర్ బెనెడిక్టా, పర్ఫ్యూజనిస్టు, అవసరమైన నర్సింగ్ సిబ్బంది ఉండటంతో ఇకపై నిరంతరాయంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.



ఆపరేషన్ చేయించుకున్న ఈరన్నతో సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి, హెచ్‌ఓడీ డాక్టర్ సి.ప్రభాకరరెడ్డి

ఎంతో క్లిష్టమైన కేసులకు కూడా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఇక్కడ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(లీగల్): విశ్వ ఆయుర్వేద పరిషత్, ఆయుష్ విభాగాల సహకారంతో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు కె.కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు రాష్ట్ర లోకాయుక్త చైర్మన్ జస్టిస్ సి.లక్ష్మణరెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. వైద్యశిబిరంలో వైద్యనిపుణులు డాక్టర్ డీపీ పద్మనాభరెడ్డి, డాక్టర్ మాధవరావు చౌదరి, డాక్టర్ వీకేఎం లావణ్య సేవలు అందిస్తారన్నారు. న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది తదితరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

9 మంది పోలీసులకు అవార్డు



వీక్లీ బెస్ట్ పర్ఫార్మెన్స్‌గా నిలిచిన పోలీసులను ప్రశంసాపత్రాలతో అభినందిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు(టౌన్): గత ఏడాది డిసెంబర్ నెలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మంది పోలీసులకు వీక్లీ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులు ప్రకటించారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది పోలీసులకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ప్రశంసాపత్రాలు అందజేశారు. 147 ఎక్సైజ్ కేసుల్లో చార్జిషీట్లు తీసుకుని కోర్టులో ఫైల్ చేసిన కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ జి.వెంకటేష్, రెండు చోరీ కేసుల్లో నిందితులను గుర్తించి రూ.1.73 లక్షలు రికవరీ చేసిన చిప్పగిరి కానిస్టేబుల్ టి.చంద్రన్న, కర్నూలు మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసుల్లో నిందితులను గుర్తించి చోరీ సొత్తు రూ.4.15 లక్షలు బంగారు ఆభరణాలు రికవరీ చేసిన కానిస్టేబుల్ ఆర్.కిషోర్, బాలాజీ నగర్ దగ్గర ఏటీఎం అపహరణకు యత్నించిన నిందితులను వెంబడించి వారికి సంబంధించిన కంటైనర్‌ను స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్ హోంగార్డు వి.రవి, పత్తికొండ అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రూ.2 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలను రికవరీ చేసిన కానిస్టేబుల్ ఎం.సుశీల్‌కుమార్, హోంగార్డ్ అన్వర్ బాషా, రూ.4.10 లక్షల చోరీ కేసును 24 గంటల్లో ఛేదించి నగదు రికవరీ చేసిన సి.బెళగల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ బి.రమేష్, చోరీ కేసులో ఇతర రాష్ట్రాలకు వెళ్లి రూ.9.50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను రికవరీ చేసిన ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ డి.శేఖర్‌బాబు, హోంగార్డ్ ముస్తాక్‌కు వీక్లీ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులను ఎస్పీ అందజేసి అభినందించారు.

20న హాకీ క్రీడాకారిణుల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 20న జూనియర్ మహిళల హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు కార్యదర్శి దాసరి సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2003 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన క్రీడాకారిణులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారిణులు ఈనెల 28 నుంచి 30 వరకు అనకాపల్లి జిల్లా ఎలమంచిలి పట్టణంలో జరిగే 13వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మహిళల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 7989043764ను సంప్రదించాలని సూచించారు.

ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దస్తగిరి రెడ్డి



రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన దస్తగిరి రెడ్డిని అభినందిస్తున్న ఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

కర్నూలు కల్చరల్: ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దస్తగిరిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలోని ఎన్జీవో హోంలో నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీసీహెచ్ వెంగల్‌రెడ్డి, జవహర్‌లాల్, జిల్లా కార్యవర్గ సభ్యుల సహకారంతో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న దస్తగిరిరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది రెండోసారి. తనకు సహకరించిన జిల్లా నేతలకు దస్తగిరిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పైసా పెంచకుండా ప్రతిపాదన

2023-24 సంవత్సరానికి విద్యుత్ కొత్త టారీఫ్

- లోటు పేరుతో ఏపీ ఈఆర్‌సీకి డిస్కంల ప్రతిపాదనలు
- చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం నిరాకరణ
- ఉమ్మడి జిల్లాలో 16 లక్షల మంది వినియోగదారులకు ఊరట
- నేటి నుంచి ఏపీ ఈఆర్‌సీ బహిరంగ విచారణ

కర్నూలు(రాజ్‌విహార్): బిల్లు ఎక్కువగా వచ్చింది.. విద్యుత్ చార్జీలు అధికంగా ఉన్నాయని జనం అనుకుంటుంటే.. ఇప్పటికే అధిక ధరకు యూనిట్‌ను కొనుగోలు చేసి తక్కువ ధరకే సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన సబ్సిడీ ప్రభుత్వం భరిస్తున్నా విద్యుత్ పంపిణీ సంస్థలు మాత్రం నష్టాల్లో ఉన్నాయని యాజమాన్యాలు చెబుతున్నాయి. లోటు పూడ్చుకునేందుకు విద్యుత్ చార్జీలు పెంచేందుకు అవకాశం ఇవ్వాలని విన్నవించాయి. అయితే, సామాన్య ప్రజలు, వాణిజ్య వ్యాపారవేత్తలపై భారం పడకుండా లోటు భరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థలు పైసా పెంచకుండా ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. దీనిపై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్‌సీ) గురువారం నుంచి మూడు రోజుల పాటు విచారణ చేపట్టనుంది. విద్యుత్‌పై సమగ్ర ఆదాయ ఆవశ్యకత, టారీఫ్, కాస్ట్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై వినియోగదారులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నుంచి సూచనలు, అభ్యంతరాలు, సలహాలు సేకరించనున్నారు.

యూనిట్ ధర రూ.7.94.. ఇస్తోంది రూ.4.50కి

విద్యుత్ పంపిణీ సంస్థలు యూనిట్‌ను రూ.4.59కు కొనుగోలు చేస్తున్నాయి. దీనికి ట్రాన్స్‌మిషన్, సరఫరా, నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు కలిపి ఒక యూనిట్ రూ.7.94 (యావరేజ్‌గా) అవుతోంది. అయితే గృహ వినియోగదారులకు తక్కువ ధరకే సరఫరా చేస్తున్నారు. గృహ వినియోగదారుల్లో మినిమమ్ 30 యూనిట్లలోపు వాడితే రూ.1.90, 125 యూనిట్లలోపు వాడితే రూ.4.50 చొప్పున వసూలు చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా సాధారణ వినియోగదారులంతా ఈ కేటగిరీల్లోపే ఉన్నారు.

లోటు కారణంగా డిస్కంల ప్రతిపాదనలు..

విద్యుత్ కొనుగోళ్లు, పంపిణీ, లైన్‌లాస్, నిర్వహణ కారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లో ఉన్నట్లు పేర్కొంటున్నాయి. లోటు పూడ్చుకునేందుకు విద్యుత్ చార్జీలు పెంచాల్సి వస్తోందని, దీనికి అనుమతి ఇవ్వాలని కోరుతూ డిస్కంలు ఏపీ ఈఆర్‌సీకి విన్నపాలు చేశాయి. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూ.6,546 కోట్లు నష్టాల్లో ఉన్నట్లు సమగ్ర నివేదికలు సమర్పించాయి. అయితే చార్జీలు పెంచేందుకు నిరాకరించిన ప్రభుత్వం ఆ లోటును తీర్చేందుకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 16 లక్షల మంది వినియోగదారులకు ఊరట లభించనుంది.

సూచనలు, సలహాలు ఇవ్వండి



2023-24 సంవత్సరానికి విద్యుత్ కొత్త టారీఫ్‌పై గురువారం నుంచి ఏపీ ఈఆర్‌సీ విచారణ చేపడుతోంది. ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్ / మెయిల్‌లో రిజిష్టర్ చేసుకున్న వారు 19, 20, 21తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా పాల్గొనేందుకు కర్నూలు విద్యుత్ భవన్, నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ కేంద్రాల్లో వీడియోకాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేశాం. – ఎం.ఉమాపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ, కర్నూలు

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



కోలంట్ల లక్ష్మీనారాయణ (ఫైల్)

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెర గ్రామానికి చెందిన రైతు కోలంట్ల లక్ష్మీనారాయణ (53) అప్పుల బాధ తాళలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత ఐదేళ్లుగా పంటల సాగులో నష్టాలు వస్తుండటంతో రెండేళ్ల క్రితం మూడెకరాల తోట విక్రయించి అప్పులు చెల్లించాడు. మరో మూడు ఎకరాల్లో పత్తి సాగు చేసినా కలిసి రాకపోవడంతో దాదాపు రూ. 10 లక్షలు అప్పులయ్యాయి. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండేళ్ల క్రితం ఇతని భార్య అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మద్దికెర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దిమ్మె మీద పడి వ్యక్తి మృతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సిమెంట్ దిమ్మె మీద పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఆసుపత్రిలో డ్రగ్‌స్టోర్ సమీపంలోని ఆక్సిజన్ ప్లాంట్‌ను ట్రామాకేర్ పక్కకు మార్చుతున్నారు. ఆ పనిని నగరంలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన కంబన్న(50)తో పలువురు కూలీలు చేస్తున్నారు. కాగా బుధవారం ఆయన కిటికీలు, రేకులు తొలగించేందుకు ప్రయత్నించే క్రమంలో కిటికీ పైనున్న సిమెంట్ దిమ్మె కంబన్నపై పడింది. కొద్దిసేపటి తర్వాత జేసీబీ ద్వారా దిమ్మెను తొలగించారు. గాయపడిన అతడిని క్యాజువాలిటీకి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పనుల సమయంలో ఇంజినీరింగ్ అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.